క్లుప్తంగా

27వ డివిజన్‌లో పర్యటించిన ఎమ్మెల్యే పేర్ని నాని



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం శాసనసభ్యుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) గురువారం నగరంలోని 27వ డివిజన్‌లో పర్యటించారు. ఆ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ షేక్ అచ్చెబాతో కలిసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రక్తహీనతను పారదోలేందుకు బలవర్ధక ఆహారం

పెడన: యుక్త వయస్సు బాలికలు, గర్భవతులు, బాలింతలలో రక్తహీనతను పారదోలడానికి అంగన్‌వాడీల ద్వారా బలవర్ధకమైన ఆహార పదార్థాలను అందజేస్తున్నట్లు ఐసీడీఎస్ పెడన అర్బన్ సూపర్‌వైజర్ ప్రవల్లిక తెలిపారు. పోషణ మాసోత్సవాల సందర్భంగా పట్టణంలోని 11వ వార్డులో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

బంటుమిల్లిలో...

బంటుమిల్లి: పేద కుటుంబాల్లోని మహిళలకు, పిల్లలకు రక్తహీనత లేకుండా ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ బంటుమిల్లి ప్రాజెక్టు అధికారి ఎం.సముద్రవేణి అన్నారు. స్థానిక బీఎస్‌ఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం కాలనీలో లబ్ధిదారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

భావదేవరపల్లి హైస్కూలుకు కుర్చీల వితరణ

భావదేవరపల్లి(నాగాయలంక): లలితాదేవి చారిటబుల్ ట్రస్ట్(చల్లపల్లి) ఆధ్వర్యంలో గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హైస్కూలుకు 12 ఫైబర్ కుర్చీలు, 35 మంది పదో తరగతి విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్ వితరణ చేశారు. గురువారం జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, ఎస్ఎంసీ చైర్మన్ వసుధ చేతుల మీదుగా ట్రస్టు చైర్మన్ ఎం.వి.కృష్ణారావు(రిటైర్డ్ డీటీ) అందజేసారు. హెచ్.ఎం జ్యోతిర్మయి, ముమ్మారెడ్డి సత్యనారాయణ, వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

నాగాయితిప్ప(మోపిదేవి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాలు..పేదలందరికీ ఇళ్లలో భాగంగా గ్రామ సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరావు గురువారం గ్రామ సచివాలయం వద్ద 45 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ గరికిపాటి గోవిందరాజులు, పాలకేంద్రం అధ్యక్షుడు పుప్పాల సతీష్(నాని), వీఆర్వో మత్తి గోపాల కృష్ణ, గ్రామ కార్యదర్శి ఉప్పాల వెంకటేశ్వరరావు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మహేష్, గరికిపాటి వెంకటేశ్వరరావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్షల ఉపకరణాల అందజేత

నాగాయలంక: కృష్ణాజిల్లా వైఎస్సార్‌సీపీ యూత్ సెల్ కార్యదర్శి ఆకుల బాబీ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక స్కాలర్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూలు లోని 50 మంది పదో తరగతి విద్యార్థులకు గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో పరీక్షల ప్యాడ్లు, ఇతర ఉపకరణాల కిట్లు పంపిణీ చేశారు. పాఠశాల అధినేతలు సునీల్‌కుమార్ పట్నాయక్, నిర్మలా పాణిగ్రాహి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఎస్సీలో యూజీడీపీఈడీ వారికి న్యాయం చేయాలి

అవనిగడ్డ: డీఎస్సీ -2024లో యూజీడీపీఈడీ చేసిన వ్యాయామ ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వాలని ఏపీ ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్ముల భానుప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుత డీఎస్సీలో బీపీఈడీ చేసిన వారికి మాత్రమే అర్హులుగా ఉన్నారని, దీనివల్ల గత నాలుగు సంవత్సరాల నుంచి శిక్షణ తీసుకుంటున్న వ్యాయామ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతోందన్నారు. పీఈటీ పోస్టులు అప్‌గ్రేడేషన్ ద్వారా స్కూల్ అసిస్టెంట్‌గా చేశారన్నారు. 8వ తరగతి లోపు ఉన్న స్కూల్స్‌లో పీఈటీ పోస్టు సృష్టించి అయినా యూజీడీపీఈడీ చేసిన వారికి డీఎస్సీలో అవకాశం కల్పించాలని కోరారు.

భీమవరం నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ ఏసీ సర్వీసు

కృత్తివెన్ను: పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుంచి కృత్తివెన్ను, బంటుమిల్లి మీదుగా హైదరాబాద్‌కు ఆర్టీసీ ఏసీ సర్వీసు బస్సును శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్ తెలిపారు. ప్రతి రోజు రాత్రి ఎనిమిది గంటలకు బస్సు భీమవరం నుంచి బయలుదేరుతుందన్నారు.

నేడు శ్రీ అద్దంకి నాంచారమ్మ సంబరం ప్రారంభం

మోపిదేవి: మండలంలోని పెదప్రోలు గ్రామంలో గ్రామ దేవత శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి సంబరం శుక్రవారం గ్రామంలో ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కూరపాటి కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఈ ఉత్సవాన్ని ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని, గ్రామస్తులు, భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మూడు దశాబ్దాల కల నెరవేరుతున్న వేళ..!

- ఉల్లిపాలెం–వేణుగోపాలపురం రహదారి నిర్మాణానికి శంకుస్థాపన
- పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- రూ.3.70 కోట్లతో సాగనున్న నిర్మాణ పనులు



కోడూరు–అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: మూడు దశాబ్దాల నుంచి రెండు గ్రామాల ప్రజలకు కలగా మిగిలిపోయిన రహదారి నిర్మాణాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రారంభించింది. మండలంలోని ఉల్లిపాలెం–వేణుగోపాలపురం గ్రామాలను కలుపుతూ గతంలో రైతులు లింకు రోడ్డును నిర్మించుకున్నారు. వేణుగోపాలపురం, సాలెంపాలెం, పిట్టల్లంక గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన కోడూరు చేరుకొనేందుకు ఈ లింకు రోడ్డు ఎంతో దోహద పడుతుంది. ప్రస్తుతం ఉన్నది మట్టి రోడ్డు కావడంతో ఈ రహదారిపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో అన్ని ప్రభుత్వాలు ఈ రహదారిని నిర్మిస్తామని హామీలు గుప్పించాయి కాని పనులు మాత్రం చేయలేదు.

ఎమ్మెల్యే రమేష్‌బాబు ప్రత్యేక చొరవ

ఉల్లిపాలెం–వేణుగోపాలపురం రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రహదారి నిర్మాణం వల్ల ఈ ప్రాంత ప్రజలకు కలిగే ప్రయోజనాల గురించి పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.70 కోట్ల నిధులను మంజూరు చేసింది. నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు శిలాఫలకాన్ని ఆవిష్కరించి, పనులకు శ్రీకారం చుట్టారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌ను కోరారు. ఈ రహదారి నిర్మాణం వల్ల నాలుగు గ్రామాల ప్రజలకు లబ్ధి చేకూరడంతో పాటు రైతులకు మేలు జరుగుతుందని రమేష్‌బాబు అన్నారు. జెడ్పీటీసీలు యాదవరెడ్డి వెంకట సత్యన్నారాయణ, చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు కటకం కుటుంబరావు, పూలేంద్రరావు, గ్రామ కన్వీనర్ బాలకృష్ణ, పీఆర్ డీఈ నాగరాజు, ఏఈ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



ఏటిమొగ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే సింహాద్రి, డీఈఈ తదితరులు

ప్రారంభమైన కోడూరు–అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మాణం

కోడూరు: కోడూరు–అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మాణ పనులను ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో గురువారం ప్రారంభించారు. అవనిగడ్డ నుంచి కోడూరు వరకు సుమారు 13 కిలోమీటర్లు ఉన్న ప్రధాన రహదారి పూర్తి గుంతలమయంగా మారడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రహదారి నిర్మాణం చేపడతామంటూ ఇచ్చిన హామీని నెరవేరుస్తూ కోడూరు రహదారి నిర్మాణానికి రూ.16.80 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం అవనిగడ్డ వైపు నుంచి రహదారి పనులను ప్రారంభించారు. భారీ యంత్రాల సహాయంతో రహదారిని చదును చేస్తున్నారు. ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నిర్మాణ పనులను పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ఎప్పటికప్పుడు నాణ్యతను పరిశీలించి, పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని సూచించారు. గత పాలకుల వైఫల్యం కారణంగా కోడూరు–అవనిగడ్డ ప్రధాన రహదారి వేసిన నెల రోజులకే ధ్వంసమైందని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేరుస్తూ నూతన రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు రమేష్‌బాబు చెప్పారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా తమ ప్రభుత్వం పెద్దపీట వేసినట్లు తెలిపారు.

ఏటిమొగ రోడ్డు పనులకు శ్రీకారం

టి.కొత్తపాలెం(నాగాయలంక): రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నాగాయలంక మండలం ఏటిమొగ మెయిన్ రోడ్డు పనులకు అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు గురువారం భూమి పూజతో శ్రీకారం చుట్టారు. టి.కొత్తపాలెం 0.0 కి.మీ నుంచి 6.20 కి.మీ వరకు రూ.2.5 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులకు శ్రీకారం చుట్టిన తదుపరి ఎమ్మెల్యే మాట్లాడుతూ టెండర్లు పూర్తి అయినప్పటికీ ఎన్నికల సమయంలో బిల్లులు కావేమోనని కాంట్రాక్టర్లు ఆసక్తి చూపరని, కానీ చాలా కాలంగా ఇక్కడ ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని కాంట్రాక్టర్‌కు విషయం చెప్పి పనులు అప్పగించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ బీసాబత్తుని ప్రసాద్, ఎంపీటీసీ మోకా నాగప్రసాద్, ఆర్‌అండ్‌బీ డీఈఈ జి.వరలక్ష్మి, జేఈ ఎం.రమేష్, బండ్రెడ్డి శ్రీనివాసరావు, నంద్యాల వెంకట కోటేశ్వరరావు, దుష్యంతుడు, రేపల్లె రామ్మోహన్‌రావు, భీమా బాబూరావు పాల్గొన్నారు.

రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- వేణుగోపాలపురంలో ఎన్నికల ప్రచారం



వేణుగోపాలపురం గ్రామస్తులతో మాటామంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని వేణుగోపాలపురం గ్రామంలో గురువారం రమేష్‌బాబు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాటామంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను రమేష్‌బాబు వివరించారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తూ గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రైనేజీల నిర్మాణం చేయడంతో పాటు పూర్తి స్థాయిలో తాగునీటిని అందించినట్లు చెప్పారు. తీర ప్రాంత రైతులకు కూడా పుష్కలంగా సాగునీటిని అందించామన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో అమలు చేసిన సంక్షేమ పథకాలు అనేక కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపాయని అన్నారు. మరోసారి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, గ్రామ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్న పాలనే రావాలి

మచిలీపట్నం వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి చంద్రశేఖరరావు



పెదకళ్లేపల్లిలో నాగేశ్వరస్వామివారికి పూజలు నిర్వహిస్తున్న డాక్టర్ చంద్రశేఖరరావు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో సాగిస్తున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన మరోసారి రావాలని మచిలీపట్నం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సింహాద్రి చంద్రశేఖరరావు అన్నారు. మండల పరిధిలోని పెదకళ్లేపల్లిలో శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి వారిని గురువారం ఆయన దర్శించుకున్నారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన స్వామివార్లకు అభిషేకం చేశారు. ఆలయ అర్చకులు ప్రసాద్ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారి వెంకట రమణ ఆలయ మర్యాదలతో సత్కరించారు. తొలిసారిగా గ్రామానికి వచ్చిన డాక్టర్ చంద్రశేఖరరావుకు వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. సింహాద్రి రామ్‌చరణ్, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ గండు దుర్గారావు, అరజా వెంకట చలపతిరావు, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడివాక శివరావు, అరజా సుబ్బారావు, గండు సాంబశివరావు, గండు సత్యనారాయణ, కొండేటి రమేష్, శీలం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం



తాళ్లపాలెంలో ఇంటింటికీ తిరిగి నవరత్నాలుపై గ్రామస్తులకు అవగాహన కలిగిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: బందరు మండలం తాళ్లపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నవరత్నాలుకు సంబంధించిన కరపత్రాలను గ్రామస్తులకు పంపిణీ చేసి ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. అందని వారు ఎవరైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. పేర్నికిట్టుకు గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి సాదరంగా గ్రామంలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, గ్రామ సర్పంచ్ మధిరి అశ్విని, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు, కానూరు పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీకాకుళపు నాగేశ్వరరావు, తాళ్లపాలెం గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

మేయర్ వెంకటేశ్వరమ్మ



12వ డివిజన్‌లో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: నగరంలో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. నగరంలోని 12వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు 9.60 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు, 11వ డివిజన్‌లో రూ.14.50 లక్షల ఎంయూడీఏ నిధులతో నిర్మించనున్న పక్కా డ్రెయిన్, 5వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, 44వ డివిజన్‌లో రూ.18 లక్షల ఎంయూడీఏ నిధులతో, రూ.20 లక్షల గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో సిమెంటు రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులు చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం, ఎంయూడీఏ నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో నగరంలోని పలు డివిజన్లలో సిమెంటు రోడ్లు, పక్కా డ్రెయిన్లు పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, 12వ డివిజన్ కార్పొరేటర్, మాజీ డిప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, 11, 12,5, 44 డివిజన్ల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్‌లు గూడవల్లి నాగరాజు, బందెల థామస్‌నోబుల్, వేముల వనబాబు మామిడిబత్తుల అజయ్, మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జి, పలు డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ సమర్థంగా అమలు చేయాలి

ఘంటసాల: ఎన్నికల కోడ్‌ను గ్రామ స్థాయిలో సమర్థంగా అమలు చేయాలని ఎంపీడీఓ బి.మారుతీ శేషమాంబ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల కోడ్ నియమ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కోడ్ అమలులోకి రాగానే గ్రామాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని, బ్యానర్లు తొలగించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసచంద్, ఈఓఆర్డీ గుత్తికొండ కిషోర్, పంచాయతీ ఈఓలు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ

చల్లపల్లి: పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు పాస్టర్లు ఎగ్జామ్ ప్యాడ్స్ (అట్టలు), పెన్నులు అందజేశారు. గురువారం స్థానిక మదర్ థెరిస్సా స్కూలులో 52 మందికి ఎగ్జామ్ ప్యాడ్లు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆండ్రూ గోమ్స్, ప్రిన్సిపాల్ ప్రశాంతి గోమ్స్, తాతా సత్యమూర్తి, జి.ప్రదీప్, జి.ఏసురాజు, గోల్కొండ డేవిడ్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమ నిర్మాణానికి ఎస్‌ఐ రూ.60 వేల విరాళం



చల్లపల్లి: గ్రామంలోని నిమ్మలతోటలో సీయోను వృద్ధాశ్రమ ఆవరణలో నూతన వృద్ధాశ్రమ భవనం నిర్మాణానికి చల్లపల్లి ఎస్‌ఐ సీహెచ్ చినబాబు రూ.60 వేలు విరాళం అందజేశారు. గత కొన్నేళ్లుగా వృద్ధులకు ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావు చేస్తున్న సేవలను ఎస్‌ఐ అభినందించారు. కార్యక్రమంలో అడపా రవి, ప్రదీప్, తాతా సత్యమూర్తి పాల్గొన్నారు.

రోడ్డు పునర్నిర్మాణానికి ముందుకొచ్చిన ఓఎన్‌జీసీ

రూ.1.91 కోట్లతో 2.2 కి.మీ మేరకు బీటీ రోడ్డు నిర్మాణం షురూ



వక్కపట్లవారిపాలెం రెగ్యులేటర్స్(లాకులు) సెంటర్‌లో ఆవిష్కరించిన శిలాఫలకం

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): మండలంలోని నాగాయలంక సమీపంలోని వక్కపట్లవారిపాలెం వద్ద ఓఎన్‌జీసీ చమురు, సహజ వాయువుల రిగ్గింగ్ సైట్ వరకు భావదేవరపల్లి మెయిన్ రోడ్డు నిర్మాణానికి ఆ సంస్థ ఉన్నతాధికారులు ముందుకొచ్చారు. గత ఆదివారం మండల వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, పరిసర గ్రామాల ప్రజలతో కలసి భావదేవరపల్లి – వక్కపట్లవారిపాలెం మెయిన్ రోడ్డు నుంచి ప్లాంట్‌లకు వెళ్లే వంతెనపై బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఓఎన్‌జీసీ ఆయిల్, గ్యాస్ ట్యాంకర్లు, ఇతర భారీ వాహనాలు నిత్యం తిరగడంతో ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిన నేపథ్యంలో సంబంధిత మెయిన్ రోడ్డు పునర్నిర్మాణ పనులను ఓఎన్‌జీసీ సంస్థే చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి మాట్లాడుతూ అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ద్వారా గత ఏడాది ప్రతిపాదనలు పంపినా సంస్థ ఉన్నతాధికారులు ఖాతరు చేయకపోవడంతో రోడ్డు పూర్తిగా శిథిలమైందని చెప్పారు. ఈ విషయమై ఆందోళన చేయగా స్పందించిన సంస్థ ఈడీ అస్సెట్ మేనేజర్(రాజమండ్రి అస్సెట్) శంతను దాస్ అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబును కలసి చర్చించారు. ఓఎన్‌జీసీ–వేదాంత నిధులు రూ.1.91లక్షలు కేటాయించి 2.2 కి.మీ బి.టి రోడ్డు పనులకు ఈనెల 12వన ఎమ్మెల్యేతో శంకుస్థాపన చేయించారు. నెలాఖరు లోపు రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని సంస్థ పేర్కొంది.

మోపిదేవి ఆలయంలో బహిరంగ వేలం

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో వివిధ కేటగిరీలలో లైసెన్స్ హక్కుకు గురువారం సీల్డ్ టెండర్ తో పాటు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధర రావు ఆధ్వర్యంలో ఉదయం వేలం పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు ఒక సంవత్సర కాల పరిమితికి వేలం పాటలు నిర్వహించినట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ, మరమ్మతులు చేయటకు విజయవాడకు చెందిన సహస్ర టెక్నాలజీ వారు రూ.1 లక్ష 62 వేలకు లైసెన్సు పొందినట్లు తెలిపారు. ఖాళీ పెరుగు డబ్బాలు(ప్లాస్టిక్) డబ్బా 1కి రూ.25కు విజయవాడకు చెందిన ఎ.శ్రీనివాస రెడ్డి లైసెన్సు పొందినట్లు చెప్పారు. షాపు నంబర్ 1లో పూజా ద్రవ్యములు, తదితర వస్తువులు అమ్ముకునే లైసెన్సు హక్కు టెండర్ ద్వారా రూ. 42,00,099కు పి.ధనలక్ష్మీ కోట్ చేశారని, ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా రూ.42,09,918కు వాకా రామమోహన్‌రావు కోట్ చేసినట్లు తెలిపారు. ఈ రెండు ప్రపోజల్స్‌ను దేవదాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని, వారి ఆదేశాల మేరకు పాటదారుని నిర్ణయిస్తామని తెలిపారు. ఆవులకు మేత (తవుడు, ఉలవలు, తెలగపిండి వగైరా) సరఫరా చేసే హక్కుకు సీల్డ్ టెండర్ ద్వారా గుడివాడకు చెందిన పీహెచ్‌వీఎస్ఆర్ ఆంజనేయులు పొందినట్లు చెప్పారు. మిగిలిన ఐటమ్స్ వాయిదా వేసినట్లు వివరించారు. మచిలీపట్నం డివిజన్ దేవదాయశాఖ తనిఖీ అధికారి కె.శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, గ్రామస్తులు, పాటదారులు పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెరిగేలా బాధ్యత తీసుకోండి

ఉప్పాల రాము

పెడన: ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో పోలింగ్ శాతం పెరిగేలా చూడాలని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటేసేలా చూడాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీ శ్రేణులపై ఉందని వైఎస్సార్‌సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము) అన్నారు. పెడన పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం రాత్రి పెడన నియోజకవర్గ స్థాయి బూత్ కమిటీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడైనా ఏమైనా ఇబ్బందులుంటే తన దృష్టికి నేరుగా తీసుకురావాల్సిందిగా సూచించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు బూత్ కమిటీలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు మల్లి, నాగబాబు, మహేష్, వెంకట్రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, కృత్తివెన్ను ఎంపీపీ గరుడప్రసాద్, పలువురు జెడ్పీటీసీలు, పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు



రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీడీ

నాగాయలంక: రాష్ట్రస్థాయి బేస్ బాల్ సబ్ జూనియర్ పోటీలకు నాగాయలంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికై నట్లు పాఠశాల హెచ్ఎం కె.శాంతకుమారి శుక్రవారం తెలిపారు. ఈనెల 13వ తేదీన గోగినేనిపాలెం ఉన్నత పాఠశాలలో ఉమ్మడి కృష్ణాజిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక జరిగినట్లు చెప్పారు. పాఠశాలకు చెందిన కొక్కిలిగడ్డ జాహ్నవి, కమ్మిలి ఝాన్సీ, అద్దంకి జ్యోతి, ఎస్.మేఘన, పి.లీల, పారుపూడి ఫ్రిహాన్స్, తుంగల యశ్వంత్ సాయి ఎంపికయ్యారు. వీరంతా 15,16,17 తేదీల్లో అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో జరిగే పదవ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల పీడీలు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావు తెలిపారు.

రైతుల పాలిట ఆపద్బాంధవుడు జగనన్న



మాట్లాం సహకార సంఘం ప్రారంభోత్సవంలో ఉప్పాల రాము, పార్టీ నాయకులు

కృత్తివెన్ను: రైతుల పాలిట ఆపద్బాంధవుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పెడన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఉప్పాల రాము అన్నారు. కృత్తివెన్ను మండల పరిధిలోని మాట్లాం గ్రామంలో రూ.19.65 లక్షలతో నిర్మించిన దేశోద్ధారక వ్యవసాయ సహకార సంఘ నూతన భవనం, గిడ్డంగిని గురువారం ఆయన సొసైటీ చైర్మన్ తమ్ము శ్రీనివాసరావుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాం గ్రామంలో తాగునీటి సరఫరాకు అవసరమైన సంపు నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు.

నేడు జగనన్న సురక్ష శిబిరం

మెరకనపల్లి(మోపిదేవి): మండలంలోని మెరకనపల్లి ఎంపీపీ స్కూల్‌లో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం శుక్రవారం నిర్వహించనున్నట్లు పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని, గ్రామస్తులు ఈ అవకాశం వినియోగించుకోవాలని సూచించారు.

వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది

జీఎంసీ ప్రిన్సిపాల్ సుందరాచారి



నూతనంగా ఎన్నికైన వారిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుందరాచారి

కోనేరుసెంటర్: అన్ని వృత్తుల్లోకెల్లా వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని ప్రముఖ న్యూరాలజిస్ట్, మచిలీపట్నం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ సుందరాచారి అన్నారు. మచిలీపట్నం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల యూనిట్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలో మచిలీపట్నం యూనిట్ అధ్యక్షురాలుగా ప్రముఖ వైద్యురాలు ఆర్.నివేదిత ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ డి.ఆశాలత, డాక్టర్ పూర్ణిమ, ప్రధాన కార్యదర్శిగా భగత్ సింగ్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారిని సుందరాచారి అభినందించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.